ఎమ్మెల్యేను మూడోసారి గెలిపించుకుందాం

సాయినగర్ వెస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కార్పొరేటర్

జంగ్ 2023 తెలంగాణ



అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో రానున్న ఎన్నికల కార్యాచరణపై స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ముచ్చటగా మూడోసారి గెలిపించుకోవడానికి మనందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పోలింగ్ బూత్‌లలో ఇన్‌చార్జ్‌లను నియమించే బాధ్యత కూడా మనమే తీసుకొని ప్రతి బూత్‌లోనూ 10 మంది ఇన్‌చార్జిలను నియమించాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కోసం ఇప్పటి వరకు ఎంతో కష్టపడ్డారన్నారు.

◆ ఇక ముందు కూడా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి వివరించే బాధ్యత కూడా కార్యకర్తలు తీసుకోవాలన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఎమ్మెల్యే గాంధీ తోడ్పాటుతో సుమారు 100 కోట్లకు పైన నిధులతో రహదారులు, డ్రైనేజీ, డ్రాగునీరు, వరద కాలువలు, కమ్యూనిటీ హాళ్లు వంటి అనే మౌలిక వసతులు కల్పించుకున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు శివరాజ్ గౌడ్, సుబ్బారావు, రఘు, జనరల్ సెక్రటరి శ్రీధర్‌రావు, జాయింట్ సెక్రటరీ బి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కేపీహెచ్‌బీ డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ, టీడీపీకి చెందిన 50 మంది నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో బోగాది శ్రీనివాస్ రావు, గంధం బాలకృష్ణ, గంధం పృథ్వీ, రాజేష్ రెడ్డి, ప్రభాకర్ చౌదరి, కొమ్మనబోయిన నాగ సురేష్, ఆంజనేయ చౌదరి తదితరులు ఉన్నారు. వీరందరికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే కృష్ణారావుల ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ పదేళ్ల కాలంలో శాంతి భద్రతల విషయంలో, విద్యుత్, మౌలిక సదుపాయాలు అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. అభివృద్ధికి పట్టం కట్టాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్‌లో చేరామన్నారు.

హాథ్ జోడో... బూత్ జోడో యాత్ర

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలో యూత్ కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి సునీల్ యాదవ్, బాలానగర్ ప్రెసిడెంట్ భరత్ ఆధ్వర్యంలో హాత్ జోడో.. బూత్ జోడో యాత్ర శుక్రవారం నిర్వహించారు. శ్రీశ్రీనగర్, ఎన్‌టీఆర్‌నగర్, ఇందిరాగాంధీనగర్, రాజీవ్‌గాంధీ నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పథకాలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ నేషనల్ జాయింట్ సెక్రటరీ చరిత కొనకల్, పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంగళరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మహిళా జనరల్ సెక్రటరీ పుష్పారెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఇమ్రాన్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ఎం. శ్రీను, వాహజ్ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న చరిత కొనకల్, గొట్టిముక్కల వెంగళరావు

ఎక్సైజ్ దాడుల్లో మద్యం, మత్తు పదార్థాల పట్టివేత

బాలానగర్: బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో నిర్వహించిన దాడుల్లో 23 కేసులు నమోదు చేశారు. దాడుల్లో 137.72 లీటర్ల మద్యం, 1330 లీటర్ల కల్లు, ఎండీఎంఏ 17 గ్రాములు, 49 గ్రాముల చరాస్, హోండా యాక్టివా వాహనం 1, 2 మొబైల్స్, వైన్స్ స్విప్పింగ్ కేసులు నమోదయ్యాయి. సీజ్ చేసిన మద్యం విలువ 30 లక్షల 68 వేల 975 రూపాయలు ఉంటుందని ఎక్సైజ్ సీఐ వేణుకుమార్ తెలిపారు. అదే విధంగా దాడుల్లో సీజ్ చేసి విలువ 35 లక్షల 2 వేల 234 రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. 6 మందిని బైండోవర్ చేశారు. అదే విధంగా కేసులతో సంబంధం ఉండి బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తుల నుంచి 2 లక్షల రూపాయల జరిమానా వసూలు చేశారని తెలిపారు. ప్రతిరోజు రూట్‌వాచ్ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ గ్యారంటీ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు మొయిజ్

మూసాపేట: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ మొయిజ్ మూసాపేటలోని ఆర్టీసీ డిపో వద్ద ప్రచారం నిర్వహించారు. పలువురికి కరపత్రాలు అందజేసి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు శంకర్, బాల్‌రాజ్, అంజి, జుబైర, ఖాసీం, నజీం, సద్దాం, సైఫ్ పాల్గొన్నారు.

బీజేపీ సంస్థాగత అంశాలపై సమావేశం



బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ కార్యాలయంలో కూకట్‌పల్లి అసెంబ్లీ ప్రభారి పాపాయిగౌడ్ పరిచయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. పార్టీ సంస్థాగత అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, నారాయణ పేట జిల్లా ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యరావు, సూర్యప్రకాష్‌రావు, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌సురేందర్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు, మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

భరోసా యాత్రలో వడ్డేపల్లి రాజేశ్వరరావు



కొత్తూరు సీతయ్యనగర్‌లో ఇంటింటికీ బీజేపీ భరోసా యాత్రలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తూరు సీతయ్యనగర్ నుంచి ఇంటింటికీ బీజేపీ భరోసా యాత్ర 66వ రోజు పాదయాత్ర శుక్రవారం ప్రారంభమైంది. ఈ పాదయాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. గడప గడపకు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మరోసారి మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు, కీలక బిల్లులు ఆమోదించారన్నారు. బీజేపీ పార్టీ అన్ని మతాలకు, కులాలకు అండగా ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రతీక.. బతుకమ్మ పండగ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. శనివారం అలిగిన బతుకమ్మ కావటంతో ఈ రోజు బతుకమ్మ వేడుకలకు దూరంగా ఉంటారు. అందుకని శుక్రవారం పలువురు మహిళలు సంప్రదాయ దుస్తులతో తరలి వచ్చి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లిలోని హనుమాన్‌చౌక్, వెంకటరావునగర్ కాలనీ, హైదర్‌నగర్‌లోని వర్టెక్స్ ప్రైమ్, ఆల్విన్‌కాలనీ, తదితర ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం రంగధాముని చెరువు వద్ద బతుకమ్మ వేడుకలను నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. అదే విధంగా పలు రెయిన్‌బో విస్టాస్, కూకట్‌పల్లిలోని దేవిస్థాన హోమ్స్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులు పాల్గొని దాండియాతో ఆకట్టుకున్నారు.



మూసాపేటలోని రెయిన్‌బో విస్టాలో..



జేఎన్‌టీయూలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు, ప్రొఫెసర్లు



బతుకమ్మ వేడుకల్లో వడ్డేపల్లి రాజేశ్వరరావు సతీమణి యామిని, కుటుంబ సభ్యులు



కూకట్‌పల్లిలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, యువతులు











కూకట్‌పల్లిలో అతి పెద్ద బతుకమ్మతో యువకుడు



ఆధ్యాత్మిక శోభ

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయాలు, అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు సైతం పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి రంగారావు, మాజీ కార్పొరేటర్లు పూజలు చేశారు.



రాధాకృష్ణ నగర్ కమిటీ అమ్మవారి మండపంలో పన్నాల హరీష్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, వివేకానందనగర్ కార్పొరేటర్ రోజాదేవి



పర్వత్‌నగర్‌లోని అమ్మవారి మండపంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు







రిటైల్ మార్కెట్, సుమిత్రనగర్‌లలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవార్లు



జనప్రియనగర్‌లో నోట్లతో అలంకరించిన అమ్మవారితో భక్తులు



అమ్మవారి ఆలయంలో హోమాలు, అభిషేకాలు చేస్తున్న భవానీమాతా మాలాధారులు



అంజయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారికి పూజలు చేస్తున్న కన్నె ప్రకాశ్

బాలానగర్ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు

బాలానగర్: కూకట్‌పల్లి జోన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాంకుమార్ బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రిజిస్టర్లను పరిశీలించారు. అదే సమయంలో శ్రీలక్ష్మి అనే మహిళ ప్రసవానికి ఆస్పత్రికి ఆమె బంధువులు తీసుకు వచ్చారు. ప్రసవం జరిగిన తరువాత బిడ్డ ఏడవకపోవటంతో వెంటనే డాక్టర్ రామ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన బిడ్డకు అత్యవసర వైద్య సహాయం అందించి బిడ్డ ఏడ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులు ఆనందంతో వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నతాధికారి అయినప్పటికీ విధి నిర్వహణలో భాగంగా వైద్యం అందజేసి సకాలంలో బిడ్డకు ఏమీ కాకుండా చర్యలు తీసుకోవటం వల్ల అక్కడకు వచ్చిన పేషెంట్లు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.



ఆస్పత్రి తనిఖీకి వచ్చి అత్యవసర వైద్య సహాయం అందించిన డాక్టర్ రామ్‌కుమార్

కూకట్‌పల్లిలో రేపు సద్దుల బతుకమ్మ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలో ఈ నెల 22న సద్దుల బతుకమ్మ, 24న దసరా వేడుకలు నిర్వహిస్తున్నామని ఉత్సవాల కో–ఆర్డినేటర్ కంచన పల్లి నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఈనెల 21న అలిగిన బతుకమ్మ కాబట్టి ఆ రోజు బతుకమ్మ వేడుకలు నిర్వహించరని, 22న సద్దుల బతుకమ్మతో వేడుకలు ఘనంగా ముగుస్తాయని తెలిపారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 24న కూకట్‌పల్లి రామాలయం వద్ద దసరా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జమ్మిపూజతో పాటు రావణ దహన కార్యక్రమం కోలాహలంగా నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అభ్యర్థుల ఎంపికలో స్తబ్ధత!

- కూకట్‌పల్లి నియోజకవర్గానికి అభ్యర్థులను ప్రకటించని బీజేపీ, కాంగ్రెస్
- బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే పేరు ప్రకటించడంతో జోరుగా ప్రచారం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీలకు అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారడంతో ఇప్పటి వరకు అభ్యర్థుల ప్రక్రియ జరగకపోవడంతో స్తబ్ధత నెలకొంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే పార్టీలు ప్రచారంలో నువ్వా నేనా అనే రీతిలో ప్రచారాలతో హోరెత్తించే పార్టీల నాయకులు ఎవరికి వారు మిన్నకుండిపోయారు. ముందుగానే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్, బీజేపీతో పాటు ఇతర పార్టీలు ఇంత వరకు అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో ఎవరా అభ్యర్థులు అని ఎవరికి వారు చర్చలతో కాలం వెల్లదీస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు ధీమాలో ఉండగా ఈసారి తమ పార్టీయే విజయ కేతనం ఎగురవేస్తుందని ఇతర పార్టీలు పేర్కొంటున్నాయి.

మూడు పార్టీలు పాదయాత్రలు..

ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎన్నికల నోటిఫికేషన్ ముందుగానే నియోజకవర్గంలో పాదయాత్ర చేసి ప్రజలతో మమేకం అయ్యారు. కాగా కాంగ్రెస్ పార్టీ కూడా వివిధ డివిజన్లలో పాదయాత్రల ద్వారా ప్రజలను కలిసింది. బీజేపీ కూడా నియోజకవర్గంలో ఇంటింటికీ బీజేపీ భరోసా ద్వారా పాదయాత్ర చేసి ప్రజలకు తమను ఆదరించాలని అభ్యర్థించింది. అభ్యర్థుల ఎంపికలో పార్టీల మనోగతం ఏమిటో తెలియక స్థానికులకే టికెట్ కేటాయించాలని కొందరు మరికొందరు తమకే టికెట్ కేటాయించాలని పార్టీ అధిష్టానానికి మొర పెట్టుకుంటున్నారు.

నెలకొన్న ఉత్కంఠ...

నియోజకవర్గంలో అభ్యర్థుల ఎంపిక విషయంలో వివిధ పార్టీల నాయకులు, కార్యాకర్తలలో ఉత్కంఠ నెలకొంది. టికెట్ ఎవరికి వస్తుందా అని ఎదురు చూడటం మినహా చేసేది ఏమి లేక ఎక్కడ పడితే అక్కడ చర్చలతో బిజీగా మారారు. పార్టీల అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయిస్తుందా అని ఆశావహులు ఎదురు చూస్తూ.. ఎవరి కేడర్‌ను వారు కాపాడుకుంటూ వస్తున్నారు. స్థానికులకే టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు కోరుతుండగా బీజేపీలో మాత్రం ఎవరికి వారు తమకు టికెట్ వస్తుందని ఆశాభావంలో ఉన్నారు.

ఇతర పార్టీలు

◆ ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారాధన్ మహారాజ్ కూడా నియోజకవర్గంలో పాదయాత్ర చేసి తమ పార్టీ అభ్యర్థి బరిలో ఉంటారని ప్రకటించడంతో ఎస్సీ ఎస్టీ బీసీ, మైనార్టీ సమాజిక వర్గాలలో కొంత ఉత్సాహాన్ని కల్పించారు. ఇలా పార్టీల నాయకులు, కార్యాకర్తలతో పాటు వ్యక్తిగత కేడర్ టికెట్ ఎవరికా అని ఎదురు చూస్తూ అంచనాలో మునిగి తేలుతున్నారు.

◆ కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తట్టుకునే నిలబడే వ్యక్తి కావాలనేది ఇతర పార్టీలు ఆలోచన. టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొని విజయం సాధించే అభ్యర్థి కోసం చూస్తున్నారు. ఇక్కడ బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కలసి బలమైన అభ్యర్థిని నిలబెడితే గెలుపు ఓటముల తీరుమారయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

నిబద్ధతతో పనిచేస్తే గెలుపు మనదే..

మోతీనగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. మూసాపేట డివిజన్ పరిధిలోని మోతీనగర్ అనుబంధ కాలనీల్లో బూత్ స్థాయి కార్యకర్తలతో శ్రావణ్ కుమార్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని పనులను ఎమ్మెల్యే కృష్ణారావు పరిష్కరించారన్నారు. ఈ తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నరేంద్రాచార్య, మాజీ కౌన్సిలర్ సీహెచ్‌సత్యనారాయణ, నాగుల సత్యం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, రాజ్‌కుమార్, నాని, అన్ని కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు.



బూత్‌స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్